




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 241 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 22-12-2025 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## రైలు టికెట్ చార్జీల పెంపు

- జనరల్ క్లాస్‌కు 215 కి.మీ తర్వాత కి.మీకు 1 పైసా పెంపు
- ఏసీ క్లాస్‌కు 500 కి.మీ.కు పది రూపాయలు పెంపు
- సబర్బన్ రైళ్ల టిక్కెట్ చార్జీల్లో మార్పు లేదన్న రైల్వే శాఖ




న్యూఢిల్లీ
ఆరు నెలల వ్యవధిలో రైల్వే శాఖ మరోసారి ప్రయాణికుల చార్జీలు పెంచింది. పెరిగిన చార్జీలు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. సబర్బన్ రైలు ప్రయాణ చార్జీలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపింది. ఆ శాఖ తెలిపిన వివరాల ప్రకారం &. 215 కిలోమీటర్ల ప్రయాణం వరకు జనరల్ క్లాస్ టికెట్ ధరల్లో మార్పు ఉండదు. అంత కన్నా ఎక్కువ దూరం ప్రయాణిస్తే, ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున చార్జీ పెరుగుతుంది. మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్

-మిగతా 2 లో


## ఏఐ, చాట్ జీపీటీ టెక్నాలజీ వాడొద్దు..

- వాటి ద్వారా దేశ రహస్యాలు లీక్ అవ్వొచ్చు
- ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం హెచ్చరిక




న్యూఢిల్లీ డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మనదేశంలో ఏఐ, చాట్ జీపీటీ టెక్నాలజీ వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. అయితే ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు వాడటం అత్యంత ప్రమాదకరమని కేంద్రం తాజాగా పేర్కొన్నది. దేశానికి సంబంధించిన రహస్య సమాచారమంతా బయటకు వెళుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి చెందిన సమాచారాన్ని మరింత ఎక్కువగా, చక్కగా తీర్చిదిద్దేందుకు కొందరు అధికారులు ఏఐ, చాట్ జీపీటీల ద్వారా షేర్ చేస్తున్నట్టు

-మిగతా 2 లో



## కాంగ్రెస్ జాతి వ్యతిరేక చర్యలు

- అక్రమ వలసదారులకు సహకారం
- అధికారం కోసమే సర్‌కు అడ్డు
- ప్రధాని మోడీ విమర్శలు

దిబ్రూగఢ్
అసోం పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. ఆ పార్టీ జాతి వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు అక్రమంగా వస్తున్న వలసదారులు అసోంలో స్థిరపడేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తోందని ఆయన విమర్శించారు. అసోంలోని దిబ్రూగఢ్ జిల్లాలో రూ.10,601 కోట్లతో నిర్మించిన ఎరువుల తయారీ కర్మాగారాన్ని మోడీ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతోనే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని ఆరోపించారు.బంగ్లాదేశ్ వలసదారులకు అసోంలో ఆశ్రయం కల్పించడం ద్వారా కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలనే ఉద్దేశంతో ఉందని

-మిగతా 2 లో

# అసెంబ్లీకి రండి

# అన్నీ చర్చిద్దాం

**నీళ్లు, నిధులు, నిజాల గురించి మాట్లాడుకుందాం**

- 811 టీఎంసీల నికర జలాల్లో 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది ఆయనే
- కేసీఆర్ ఇప్పటికైనా బయటకు వచ్చారు.. స్వాగతిస్తున్నాం
- ఉమ్మడి రాష్ట్రంలోకన్నా ఆయన హయాంలోనే తెలంగాణకు అన్యాయం
- కేసీఆర్, కేటీఆర్‌లు ఆర్థిక ఉగ్రవాదులు
- హరీశ్‌రావు, కేటీఆర్ మధ్య గొడవలో కవిత బలి
- బీఆర్ఎస్-బీజేపీ ఒకటేనని తేలుతోంది కేసీఆర్ కోరితే జనవరి 2 నుంచే అసెంబ్లీ
- పాత్రికేయులతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు కృష్ణా జలాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించేందు కు మాజీ సీఎం కే చంద్రశేఖరరావు (కేసీఆర్) అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన కోరితే జనవరి 2వ తేదీ నుంచే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కేసీఆర్ స్థాయికి, ఆయన వయస్సుకు అగౌరవం కలుగకుండా చూస్తామని హామీనిచ్చారు. ప్రధాన ప్రతిపక్షనేతగా వివిధ

-మిగతా 2 లో



## 'బిగ్‌బాస్ సీజన్-9' విజేత కల్యాణ్ పడాల

- రూ.35లక్షల ప్రైజ్ మనీతో పాటు, ట్రోఫీని కైవసం
- అలాగే మారుతీ సుజుకీ విక్టోరిస్ కారును కూడా కల్యాణ్ సొంతం
- అగ్ని పరీక్షలో ఒక కామన్‌మ్యాన్‌గా కల్యాణ్ పడాల పోటీ
- ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్‌తోనే నా ప్రయాణం
- అందరికీ థ్యాంక్స్" అని కల్యాణ్ సంతోషం వ్యక్తం

హైదరాబాద్ డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బిగ్‌బాస్ సీజన్-9 విజేతగా కల్యాణ్ పడాల నిలిచారు. చివరి వరకూ ఉత్కంఠగా సాగిన ఈ సీజన్‌లో ప్రేక్షకుల నుంచి అత్యధిక ఓట్లు సాధించిన కల్యాణ్ విజేతగా నిలిచినట్లు వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. బిగ్‌బాస్ ఇచ్చిన రూ.20లక్షల గోల్డెన్ బ్రీఫ్ కేసును కూడా వద్దనుకుని చివరి వరకూ విజయంపై నమ్మకంతో నిలబడ్డాడు. ఆ నమ్మకమే కల్యాణ్‌ను విజేతని చేయడమే కాదు.. రూ.35లక్షల ప్రైజ్ మనీతో పాటు, ట్రోఫీని అందుకునేలా చేసింది. ఈసారి బిగ్‌బాస్‌కు ముందు నిర్వాహకులు పెట్టిన అగ్ని పరీక్షలో ఒక కామన్‌మ్యాన్‌గా కల్యాణ్ పడాల పోటీ పడ్డారు. అక్కడ కూడా

-మిగతా 2 లో



## పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చొద్దు

- అలాంటి ఘోర తప్పు చేయొద్దు
- అమెరికాకు రష్యా హెచ్చరిక
- యూఎస్-వెనిజులా ఉద్రిక్తతల నడుమ పుతిన్ వార్నింగ్

వాషింగ్టన్, కారకాస్, మాస్కో
అమెరికా-వెనిజులా మధ్య యుద్ధ పరిస్థితులు ముదురుతున్న తరుణంలో రష్యా నుంచి బలమైన వార్నింగ్ వచ్చింది. పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చే ఘోర తప్పు చేయవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు రష్యా అధినేత పుతిన్ హెచ్చరికలు పంపారు. ఈ విషయాన్ని క్రెమ్లిన్ తెలిపింది. "ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు వేగంగా పెరుగుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీయొచ్చు" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి చెప్పారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, అమెరికా-వెనిజులా మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రష్యా నుంచి ఇలాంటి హెచ్చరికలు రావటం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత కొన్ని రోజులగా అమెరికా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నది. వెనిజులాను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నది. ఇటీవల కరేబియన్

-మిగతా 2 లో




## త్వరలో తెలంగాణలో సర్

- బీహార్‌లో బీఎల్ఓలు ఆదర్శంగా నిలిచారు 'సర్' నిరంతర ప్రక్రియ
- ఆధార్ గుర్తింపు కార్డే.. పౌరసత్వ నిర్ధారణ కాదు
- దాన్ని ఓటర్ కార్డుతో లింక్ చేయలేం
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెల్లడి

హైదరాబాద్ డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
త్వరలో తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తెలిపారు. దీనికి బూత్‌స్థాయి అధికారులు (బీఎల్ఓ) సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఏటా ఓటర్ల జాబితాల సవరణ ఉంటుందనీ, కొత్తగా వచ్చే ఓటర్లు, మరణించిన, బదిలీ అయినవారి వివరాలతో

-మిగతా 2 లో

## ఏపీ నీటి దోపిడీపై మరో ఉద్యమం

**కృష్ణా నది నుంచి 135 టీఎంసీలు రావాలి**




- 45 టీఎంసీలకు ఎలా ఒప్పుకుంటారు?
- పాలమూరు రంగారెడ్డికి అన్యాయం
- ప్రజా క్షేత్రంలో ఎండగడతాం
- కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో అన్నింటా విఫలం
- భూములు అమ్ముకునేందుకే ఫార్మాసిటీ రద్దు
- ఇప్పటి దాకా ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క
- రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్
రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లలో అన్నింటా విఫలం చెందిందని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్) అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీపై మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

-మిగతా 2 లో

## అట్టహాసంగా మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-4 ప్రారంభం


- పోటీలను ప్రారంభించిన నారా బ్రాహ్మణి, సినీహీరో నిఖిల్, ఎంపి సానా సతీష్



మంగళగిరి ( గుంటూరు జిల్లా)
జనవరి 23న రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి, మంగళగిరి శాసన సభ్యులు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జనవరి 21 వరకు నిర్వహించే ఈ పోటీలను ఆదివారం నారా బ్రాహ్మణి, ఎంపి సానా సతీష్, హీరో సిద్ధార్థ్ నిఖిల్, నియోజకవర్గ కూటమి నాయకులు పోటీలను ప్రారంభించారు. దానికి ముందు ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి బ్యాటింగ్ చేసి సందడి చేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ -4 లో మొదటి రోజు మ్యాచ్ స్పెన్సర్స్ లెవెన్ శ్రీకృష్ణ లెవెన్ జట్టుల మధ్య జరగ్గా శ్రీకృష్ణ లెవెన్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ ఎంతో ఖర్చుతో కూడిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి టోర్నమెంట్లను నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ క్రీడలను ప్రోత్సహించడం వల్లే మంగళగిరి నుంచి కెపి సాయి రాహుల్, పావని అనే మహిళ కూడా ఆంధ్ర జట్టులో ఆడుతున్నారని వివరించారు. మంగళగిరి నుంచి ఇద్దరు ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడం గొప్ప విషయమని

-మిగతా 2 లో

# ఏఐ, చాట్‌జీపీటీ టెక్నాలజీ వాడొద్దు..




మొదటి తరువాయి

కేంద్రం తెలిపింది. దీనివల్ల మనదేశంలో ఏం జరుగుతున్నది? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న పనులు, ఇతర కీలక సమాచారం అంతా ఏఐ, చాట్‌జీపీటీ ద్వారా పక్క దేశాలకు చేరుతున్నట్టు కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. వీటిని అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సభకు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ ఈ రెండు వేదికల్లో (ఏఐ, చాట్ జీపీటీ) ప్రభుత్వ సమాచారాన్ని షేర్ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి తెలిపారు.

## రైలు టికెట్ చార్జీల పెంపు

మొదటి తరువాయి

ఏసీ క్లాస్ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరుగుతాయి. ఏసీ క్లాస్ ప్రయాణానికి కూడా ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున టికెట్ చార్జీ పెరుగుతుంది. ఈ కొత్త చార్జీలు అమల్లోకి వస్తే, నాన్ ఏసీ క్లాస్‌లో 500 కి.మీ ప్రయాణానికి టికెట్ ధర రూ.10 పెరుగుతుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ ప్రయాణ టికెట్ చార్జీలు ప్రతి కి.మీ.కి ఒక పైసా చొప్పున పెరిగింది, ఏసీ క్లాస్‌లో ప్రతి కి.మీ.కి రెండు పైసల చొప్పున పెరిగింది. ఈ పెంపు వల్ల సంవత్సరానికి రూ.600 కోట్ల ఆదాయం రైల్వేలకు సమకూరుతుంది. గడచిన దశాబ్దంలో నెట్‌వర్క్, కార్యకలాపాలను గణనీయంగా విస్తరించినట్లు రైల్వేలు ప్రకటించింది. ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచినట్లు తెలిపింది. ఉద్యోగుల కోసం ఖర్చులు రూ.1,15,000 కోట్లకు పెరిగినట్లు, పింఛను వ్యయం రూ.60 వేల కోట్లకు పెరిగినట్లు వివరించింది. ఈ ఖర్చులను భరించడం కోసం కార్గో లోడింగ్, ప్రయాణికుల టిక్కెట్ చార్జీల పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొంది.

## 'బిగ్‌బాస్ సీజన్-9' విజేత కల్యాణ్ పడాల

మొదటి తరువాయి

ప్రేక్షకుల మనసులు గెలుచుకొని హౌస్‌లోకి అడుగు పెట్టాడు. సిఆర్‌పిఎఫ్ జవాన్ అయిన కల్యాణ్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. అయితే ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. 'బిగ్‌బాస్ సీజన్9' సందర్భంగా నిర్వహిస్తున్న అగ్నిపరీక్ష గురించి తెలిసి దరఖాస్తు చేసుకున్నారు. అలా సామాన్యుల నుంచి హౌస్‌లోకి అడుగు పెట్టిన తొలి కంటెస్టెంట్ కూడా కల్యాణే కావడం గమనార్హం. ఈ సీజన్ తొలినాళ్లలో కల్యాణ్ ఆటతీరు ఏమంత ఆసక్తికరంగా సాగలేదు. ఎక్కువ మంది కంటెస్టెంట్‌లు ఉండటంతో అతడికి స్క్రీన్ స్పేస్‌కూడా తక్కువే లభించింది. ప్రియ ఎలిమినేట్ తర్వాత నుంచి కల్యాణ్ ఆట తీరు మారింది. చివరి వరకూ తనదైన శైలిలో ఆడుతూ ముందుకు సాగాడు. తనూజ, ఇమ్మాన్యుయేల్, డిమోన్ పవన్‌ల నుంచి కల్యాణ్‌కు గట్టి పోటీ ఎదురైనా%ౌ% తనదైన ఆట తీరుతో హౌస్‌కు చివరి కెప్టెన్‌గా, మొదటి ఫైనలిస్ట్‌గా నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు బిగ్‌బాస్ సీజన్-9 విజేతగా నిలిచి ప్రైజ్ మనీతో పాటు, ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. షో స్పాన్సర్స్‌లో ఒకరైన 'రాఫ్ గ్రిప్పింగ్' విజేత అయిన కల్యాణ్‌కు మరో రూ.5లక్షల క్యాష్ ప్రైజ్‌ను అందించారు. అలాగే మారుతీ సుజుకీ విక్టోరిస్ కారును కూడా కల్యాణ్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ.. 'నన్ను ప్రేమించిన వారికి, నన్ను నమ్మి ఓటు వేసిన వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. ఈ సీజన్‌లో ప్రియ, శ్రీజ, తనూజలు నన్నెంతో సపోర్ట్ చేశారు. వారికి స్పెషల్ థ్యాంక్స్. ఒకానొక సమయంలో కల్యాణ్‌కు ధైర్యమిచ్చి ముందుకు పంపిన వ్యక్తి తనూజ. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నా తల్లిదండ్రులు వారి స్థాయికి మించి నన్ను పోషించారు. వాళ్లు లేకపోతే నేను లేను. ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్‌తోనే నా ప్రయాణం ఇక్కడి వరకూ సాగింది. అందరికీ థ్యాంక్స్" అని కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ జాతి వ్యతిరేక చర్యలు

మొదటి తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల గుర్తింపు, ఉనికి, ఆత్మగౌరవం గురించి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రమూ పట్టింపు లేదని విమర్శించారు. "సర్ ప్రక్రియను అడ్డుకునేందకు కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా ప్రయత్నిస్తోంది. నేనేం మంచి చేయాలనుకున్నా.. దానికి మోకాలడ్డుతోంది. ప్రజల గౌరవం, ఉనికిని కాపాడేందుకు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల నుంచి అసోంను కచ్చితంగా రక్షించాల్సిన అవసరం ఉంది. అందుకు బీజేపీ ఓ రక్షణ కవచంలా నిలుస్తుంది" అని మోడీ తెలిపారు. అసోం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అక్కడ బీజేపీ ఇప్పటి నుంచే ప్రచార తీవ్రతను పెంచింది. ఇందులో భాగంగా అసోంలో అభివృద్ధి పనుల పేరిట ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ విమర్శలకు దిగుతున్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

# అసెంబ్లీకి రండి అన్నీ చర్చిద్దాం

మొదటి తరువాయి

అంశాలపై చట్టసభల్లో మాట్లాడాలి తప్ప రోడ్లమీద కాదంటూ చురకలంటించారు. పదేండ్ల పాటు రాష్ట్రంపై కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం రాత్రి జరిగిన ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్‌లో పరివర్తన వస్తుందని ఆశించామన్నారు. కానీ, అబద్ధాలే పెట్టుబడిగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వివిధ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ కలుగులోంచి ఎలుకను లాగినట్టు ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్‌ను బయటకు లాక్కొచ్చిందని వ్యంగ్యంగా అన్నారు. ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో జలదోపిడీ ఎక్కువగా జరిగిందంటూ లెక్కలు వివరించారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలైన నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు కేసీఆర్ మరణశాసనం రాశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు బాండ్ పేపర్‌పై రాసిచ్చిందే కేసీఆర్ అనీ, ఈ విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రకటిస్తామనే భయంతోనే ఆయన అసెంబ్లీకి రావట్లేదని చెప్పారు. ఆయన తన హయాంలో



కాంట్రాక్టులు, కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారే తప్ప, పాలమూరు-రంగారెడ్డిపై ఎన్నడూ దృష్టి పెట్టలేదని వివరించారు. కేసీఆర్ తన పదేండ్ల పాలనలో మక్తల్, నారాయణపేట, డిండి, ఎస్ఎల్‌బీసీ, రాజీవ్‌సాగర్, సీతారామ ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. పదేండ్లలో రూ.2 లక్షల కోట్లను నీటిపారుదలపై ఖర్చుచేశారనీ, ఆ డబ్బులన్నీ ఎటు పోయాయని నిలదీశారు. కేసీఆర్ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకత్వాన్ని సరిచేసుకుంటూ రాష్ట్రాన్ని క్రమంగా గాడిలో పెడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఇప్పటి వరకూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.6,800 కోట్లు ఖర్చుచేసిందని ప్రకటించారు. బీఆర్ఎస్ హయాంలో సమర్పించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ సరిగా లేదనే కారణంతోనే కేంద్రం దాన్ని తిప్పి పంపిందని గుర్తుచేశారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణ వాటా కచ్చితంగా ఇవ్వాల్సిందేనంటూ తాము కొట్లాడుతున్నామన్నారు. కానీ కేసీఆర్ తన హయాంలో తెలంగాణకు 34 శాతం నీటి వాటా కావాలని సంతకం పెట్టి, మిగతా 64 శాతం ఆంధ్రకు కేటాయించారని విమర్శించారు. ఈ నిజాల్ని నిగ్గుతేల్చేందుకే కేసీఆర్ అసెంబ్లీకి రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ నీళ్లను తరలించుకుపోతున్నారంటూ కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారనీ, అసలు ఆ అవకాశం ఇచ్చిందే ఆయనని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వివాదాలపై బీఆర్ఎస్ ఏనాడూ స్పందించలేదని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి న్యాయనిపుణులతో చర్చించి సుప్రీం కోర్టులో, అపెక్స్ కౌన్సిల్‌లో ట్రిబ్యునల్‌లో ఉన్న వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. వరి దిగుబడి విషయంలో కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని కొట్టిపారేశారు. కాళేశ్వరం కూలిపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2025 ఖరీఫ్‌లో 61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని గుర్తుచేశారు.

# త్వరలో తెలంగాణలో సర్

మొదటి తరువాయి

మారుతూనే ఉంటాయన్నారు. 'సర్' నిరంతర ప్రక్రియ అని స్పష్టంచేశారు. ఇప్పటికి 13 రాష్ట్రాల్లో ఆ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో అమలయ్యే 'సర్'కు అందరూ సహకరించాలని కోరారు. భారత ఎన్నికల వ్యవస్థలో బీఎల్‌వోలదే కీలకపాత్ర అని చెప్పారు. ఓటర్ కార్డులకు ఆధార్‌ను లింక్ చేయాలనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ఆధార్ కార్డు కేవలం గుర్తిపు కార్డు మాత్రమేననీ, పౌరసత్వ గుర్తింపునకు రుజువు కాదని తేల్చిచెప్పారు. దాన్ని ఓటర్ గుర్తింపు కార్డుకు లింక్ చేయడం కుదరదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)తో ఆయన ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జ్ఞానేష్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా శుద్ధిలో తెలంగాణ దేశానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఇటీవల బీహార్ లో విజయవంతంగా పూర్తయిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ పరిరక్షణకు బీఎల్‌వోలే వెన్నెముక అని చెప్పారు. వారి నిబద్ధత, కృషిపైనే ఓటర్ల జాబితా శుద్ధి విజయం ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రపంచం మొత్తం భారతదేశ ఎన్నికల నిర్వహణను ఆసక్తిగా గమనిస్తున్నదని తెలిపారు. బీహార్‌లో భారీ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి లోపాలు లేకుండా పూర్తయిందని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 7.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని గుర్తు చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదనీ, రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం రాకపోవడం విశేషమని అన్నారుఈ విజయానికి కారణమైన బీహార్ బీఎల్‌వోలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. తెలంగాణ విస్తీర్ణం కెనడా కంటే పెద్దదని పేర్కొన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా శుద్ధి పూర్తయిన తర్వాత రాష్ట్రంలో ఎన్నికల పరిపాలన ఒక కొత్త యుగంలోకి అడుగుపెడుతోందన్నారు. పలువురు బీఎల్‌వోలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలక గణాంకాలను వివరించారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య, జిల్లాలు, ఎమ్మెల్యే నియోజకవర్గాలు, ఎంపీ నియోజకవర్గాలు తదితర వివరాలను వివరించారు. సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వరరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సీనియర్ డిప్యూటీ సీఈసీ పవన్‌కుమార్ శర్మ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ నీటి దోపిడీపై మరో ఉద్యమం

మొదటి తరువాయి

ప్రజాక్షేత్రంలో ఏపీ, తెలంగాణ కాంగ్రెస్ తప్పిదాలను ఎండగడతామని స్పష్టంచేశారు. పాలమూరు జిల్లాలో కృష్ణానది 300 కి.మీ ప్రవహిస్తున్నా, నీటి వాటాల విషయంలో 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, 20 ఏండ్లు పాలించిన టీడీపీ పార్టీలు అన్యాయం చేశాయని ఆరోపించారు. 1974లో బచావత్ ట్రైబ్యునల్ 17 టీఎంసీలు జూరాలకు సుమోటోగా కేటాయించినా, దాన్ని ఏ సర్కారు పట్టించుకోలేదన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు మహబూబ్‌నగర్ జిల్లాను దత్తత తీసుకుని వేసిన పునాదిరాళ్లు ఇంకా కనిపిస్తునే ఉన్నాయని ఎద్దేవా చేశారు. "రెండేండ్లు గడిచినా పాలమూరు-రంగారెడ్డిలో తట్టెడు మట్టి తీయలేదు. కేటాయింపులు ఉన్నా వాటిని అమలు చేయలేదు. పెండింగ్ ప్రాజెక్ట్‌లు అని పేరు పెట్టారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దోదావరి, కృష్ణా నదీ జలాలపై సమీక్ష చేశాం. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా కల్వకుర్తి, నెట్టెంపాడు బీమా ద్వారా 6.5 లక్షల ఎకరాలకు నీరందించాం. మిషన్ కాకతీయ ద్వారా 1.5 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. కాని నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ నీటి వాటాలు సాధించడంలో రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిందని విమర్శించారు. బచావత్ ట్రిబ్యునల్ లెక్కల ప్రకారం మొత్తం 174 టీఎంసీలకు గాను తాము అధికారంలో ఉన్నప్పుడు 90.81 టీఎంసీలు కేటాయించాలని అడిగామని గుర్తు చేశారు. మిగిలిన నీటిలో కర్ణాటకకు 25, మహారాష్ట్ర 14 టీఎంసీలు తీసుకోగా తెలంగాణకు రావాల్సిన 45 టీఎంసీలతో కలిపి దాదాపు 135 టీఎంసీలు రావాల్సి ఉందని అన్నారు. కాని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 45 టీఎంసీలు ఇవ్వాలని లేఖ ఎలా రాస్తారని ప్రశ్నించారు. బచావత్ ట్రిబ్యునల్ ద్వారా సంక్రమించిన హక్కులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కాపాడుకోలేక పోతున్నదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ చంద్రబాబు మాటలు పట్టించుకుని పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి పంపిందని ఆందోళన వ్యక్తం చేశారు. డిల్లీ స్థాయిలో దాన్ని ప్రతిఘటించాల్సిన సర్కార్ ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. "దేశంలో కొత్త రాష్ట్రం ఏర్పడితే ఎస్ఆర్‌సీ యాక్ట్ ప్రకారం కొన్ని ప్రత్యేక అవకాశాలు కల్పిస్తారు. వాటిని బుల్డోజ్ చేశారు. నీటి పంపకాల్లో మొదలు అన్నింటా కొత్త రాష్ట్రాలకు అవకాశాలు ఇవ్వాలి. కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టక పోవడంతో సుప్రీంకు వెళ్లాం. అప్పటి కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సూచన మేరకు విత్‌డ్రా చేసుకున్నాం. సెక్షన్ 3 వేశారు. ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయి. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం రాజీ పడింది. గోదావరి మీద నల్లమల్ల సాగర్, కృష్ణాలో పాలమూరు-రంగారెడ్డికి ఏపీ చేస్తున్న నీటి దోపిడిపై మరో ఉద్యమం తప్పదు" అని కేసీఆర్ హెచ్చరించారు. నాలుగైదు రోజుల్లో జల దోపిడిపై షెడ్యూల్ ప్రకటించి ప్రజా క్షేత్రంలో పోరాడతామని చెప్పారు. కవులు, కళాకారులు, మేధావులను ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తామని ప్రకటించారు.

## పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చొద్దు

మొదటి తరువాయి

సముద్రం, తూర్పు పసిఫిక్‌లో డ్రగ్ రవాణాతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో అమెరికా కొన్ని నౌకలపై దాడులకు దిగిన విషయం విదితమే. ఇవే పరిణామాలు వెనిజులా చుట్టూ భారీ అమెరికా సైనిక సమీకరణకు దారి తీశాయి. ప్రస్తుతం కరేబియన్ ప్రాంతంలో 11 అమెరికా యుద్ధ నౌకలను మోహరించారు. వేలాది మంది సైనికులు అక్కడ పని చేస్తున్నారు. ప్యూర్టో రికో సహా అనేక స్థావరాల నుంచి వెనిజులా తీరరేఖ వెంట గస్తీ విమానాలు ఎగురుతున్నాయి. ఇదే సమయంలో ట్రంప్.. వెనిజులా నుంచి వెళ్లే, వచ్చే నిషేధిత చమురు ట్యాంకర్లపై 'పూర్తి నిర్బంధం' విధిస్తున్నట్టు ప్రకటించారు. ఇది యుద్ధ చర్యలకు సంకేతంగా ఉన్నదని అమెరికాకు చెందిన కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా చమురు కోసం రక్తపాతం వద్దని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ఓ ర్యాలీలో ప్రసంగిస్తూ చెప్పారు. "యుద్ధం వద్దు.. మెర్రీ క్రిస్మస్! ఆందోళన వద్దు, ఆనందంగా ఉండండి" అని సందేశమిచ్చారు. కాగా అమెరికా-వెనిజులా మధ్య నెలొకన్న ఉద్రిక్త పరిస్థితిని నివారించేందుకు బ్రెజిల్ అధ్యక్షుడు లులా మధ్యవర్తిత్వానికి సిద్ధమని ప్రకటించారు. ఇటు చైనా వెనిజులాకు మద్దతుగా ఉన్నది. అమెరికా ఒత్తిడిని విమర్శించింది.

## అట్టహాసంగా మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-4 ప్రారంభం

మొదటి తరువాయి



ఎర్కొన్నారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఎపి ముందుకు వెళ్తుందన్నారు. 128 జట్లతో పోటీలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నారా బ్రాహ్మణికి 'బిజినెస్ టుడే మోస్ట్ పవర్ ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డు' రావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఎపి ఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# టీఎంఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణితం పరీక్ష



**మనోహరాబాద్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో టీఎంఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి గణితం పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పరీక్షను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఇంగ్లీషు మీడియంలో ప్రథమ స్థానాన్ని సృజన (కాళ్లకల్), ద్వితీయ స్థానాన్ని జూనా కుమారి (కూచారం), తృతీయ స్థానాన్ని అనూష (మనోహరాబాద్) సాధించారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానాన్ని మౌనిక (రంగాయిపల్లి), ద్వితీయ స్థానాన్ని అఖిల (రంగాయిపల్లి), తృతీయ స్థానాన్ని అభిలాష్ (రంగాయిపల్లి) గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి రావు, ట్రెజరీ నాగిరెడ్డి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కడ్తాల్ పిరమిడ్ లో ధ్యాన మహాయాగం వేడుకలు ప్రారంభం

-మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
-వేడుకలను ప్రారంభించిన సిబిఐ మాజీ డైరక్టర్ కార్తికేయన్
-దేశ విదేశాల నుంచి ధ్యాన గురువులు, పిరమిడ్ మాస్టర్ల హాజరు
-భారీగా తరలివచ్చిన తెలుగు రాష్టాల ద్యానులు
-సందడిగా మారిన కడ్తాల్ పిరమిడ్ పరిసరాలు
--ఈ నెల 31వరకు ధ్యాన సంబరాలు







**కడ్తాల్, డిసెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ ప్రసిద్ధమైన హైదరాబాద్ నగర శివారులోని కడ్తాల్ కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలకు సిద్ధమైంది. పదకొండు రోజుల పాటు నిర్వహించే ధ్యాన మహాయాగం -4 వేడుకలు ఆదివారం ప్రారంభమాయ్యాయి. ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ధ్యాన వేడుకలను సిబిఐ మాజీ డైరక్టర్ కార్తికేయన్ ప్రారంభించారు. తొలి రోజు తెలుగు రాష్టాల నుంచి ద్యానులు పెద్ద సంఖ్యలో పిరమిడ్ కు చేరుకున్నారు. కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహాయాగానికి దేశ విదేశాల నుంచి ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు తరలివచ్చారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక



**కడ్తాల్, డిసెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
కడ్తాల్ మండలంలో ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులు డిప్యూటీ సర్పంచ్ ఎర్ర రామకృష్ణ ,తులసి రామ్, లక్ష్మణ్ ,గంగాధర్, అరుణ్ కుమార్,పవన్ ,సిద్ధార్థ, నర్సింహ, కృష్ణ,గోపాల్, దేవేందర్ ,భరత్ , కుమార్, రాకేష్, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్య నాయక్,మాజి సర్పంచ్ లు నరేందర్, శివాజీ, విఠల్, శ్రీను , రవి , మంజునాథ్, హరి, గోపాల్, శ్రీను, రాజు,శ్రీను, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సర్పంచులను గ్రామాభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం






**కేశపట్నం, డిసెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజాప్రతినిధుల సన్మాన సభలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీకి దీటుగా బిజెపి సర్పంచులను గ్రామాభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతామని, ఇందుకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సహకారం అందిస్తారని తెలిపారు. శనివారం మండలంలోని మొలంగూర్ వివిఎస్ఆర్ గార్డెన్‌లో బిజెపి మండల శాఖ అధ్యక్షుడు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో గెలిచిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో చరిత్ర తిరగరాసిన బిజెపి గతంలో కంటే మెరుగైన స్థానాలను గెలుచుకుందని, భవిష్యత్తులో శంకరపట్నంలో బిజెపి పాగా వేయడం ఖాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దమ్ముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ గత 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం లక్షల కోట్ల నిధులు మంజూరు చేశారని, అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర సహకారంతో జరుగుతున్నాయని వివరించారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న పనులు మోడీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే కొనసాగుతున్నాయని అన్నారు. తరువాత కరీంనగర్ పార్లమెంటరీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ బిజెపి ఆధ్వర్యంలో గెలిచిన ప్రజాప్రతినిధులను గౌరవంగా చూసుకుంటామని, వారికి ఏ ఇబ్బంది కలిగినా పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడే అవసరం లేదని, కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, కేంద్రమంత్రి బండి సంజయ్ అనేక కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచులు కొయ్యడ కుమార్ యాదవ్, కొయ్యడ రజిత అశోక్, ఎన్నం మల్లేష్, మోరె స్వరూప రవి, దేవునూరి అంజలి సమ్మయ్య, ఉప సర్పంచులు జంగ జైపాల్, పొన్నం మహేష్, చింతల శ్రీధర్ రెడ్డి, గుర్రం రేణుక శ్రీనివాసులు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, మండల ఇంచార్జీ గుజ్జ శ్రీనివాస్, నాయకులు దొంగల రాములు, లోకేష్, దాసరపు నరేందర్, రాసమల్ల శ్రీనివాస్, చెర్ల శ్రీనివాస్తో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంచార్జీలు, మోర్చాల నాయకులు, బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం సచివాలయం ముట్టడి జయప్రదం చేయాలి

## అండేకార్ యాదిలాల్

**ఆమనగల్లు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి తక్షణమే అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 24న చేపట్టనున్న సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, న్యాయవాదుల భద్రత, గౌరవం, వృత్తి పరిరక్షణ కోసం ఈ ఉద్యమం అనివార్యమని స్పష్టం చేశారు. న్యాయవాదులు ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలక స్థంభమని, అయితే ఇటీవలి కాలంలో వారు అనేక సమస్యలు, అవమానాలు, భద్రతా లోపాలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం




చేశారు. ఈ నేపథ్యంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే 41ఏ సీఆర్‌పీసీ నిబంధనలను సవరించి న్యాయవాదులకు న్యాయ పరిరక్షణను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు అందిస్తున్న ఆరోగ్య బీమా పరిమితిని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రూ. 10 లక్షలకు పెంచాలని, ఆర్థిక ఇబ్బందులతో వృత్తిలో నిలదొక్కుకునేందుకు కృషి చేస్తున్న జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 10,000 స్టైఫండ్ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇవన్నీ న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన మౌలిక డిమాండ్లేనని తెలిపారు. ఈ డిమాండ్ల సాధన కోసం సోమవారం ఉదయం ఆమనగల్లు పట్టణం నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొని, అనంతరం సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అండేకార్ యాదిలాల్ పిలుపునిచ్చారు. న్యాయవాదుల హక్కులు, భద్రత కోసం చేపట్టిన ఈ పోరాటం ప్రభుత్వం స్పందించే వరకు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు

## మెడికల్ మాఫియా అరాచకాలు

**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ధనార్జనే ధ్యేయంగా కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ మాఫియా చెలరేగిపోతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు చేరే రోగులను ప్రాణాపాయం నుండి కాపాడాల్సిన హాస్పిటల్ యాజమాన్యాలు, వారి పరిస్థితిని ఆసరాగా చేసుకుని నిలువునా దోచుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.ఎన్.సి. కంపెనీలు తయారు చేసిన మందులు వాడాల్సిన చోట, లోకల్‌గా తయారైన నాసిరకం మందులను ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని, అదనంగా అనవసర పరీక్షలు చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒకే రకమైన వ్యాధికి ఒకే ఫార్ములా మందులు



వాడుతున్నప్పటికీ, ఒక్కో ఆసుపత్రిలో ఒక్కో రకమైన ధరలు నిర్ణయించడం ఆశ్చర్యకరమని శ్రీనివాస్ పేర్కొన్నారు. లోకల్ కంపెనీలతో ముందే లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని, ఆసుపత్రులు నిర్ణయించిన ధరలనే మందులపై ముద్రించాల్సిందిగా ఒత్తిడి తెచ్చి, రోగులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడిని నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్లు నిద్రమత్తులో ఉన్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ ఆసుపత్రుల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆసుపత్రుల ముందు ఆందోళనలు చేపడతామని పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు.

# అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన అన్మాస్ పల్లి

అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా



**కడ్తాల్, డిసెంబర్ 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మనుషులకు ఉన్న స్వార్థం వీడి దైవచింతనను అలవర్చుకోవాలనీ దీంతో సంతోషం రెట్టింపు అవుతుందని డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. ఆదివారం కడ్తాల మండలంలోని అన్మాస్ పల్లి, కర్కల్ పహాడ్ గ్రామాలలో అయ్యప్ప స్వామి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అన్మాస్ పల్లి గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాముల భక్త బృందం ఇరుముడి మహా పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, నూతన సర్పంచ్ డాన్ శ్రీను, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, బి రాము గుప్తా లతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కర్కాల్ పహాడ్ గ్రామ సర్పంచ్ గా ఇటీవల గెలుపొందిన తేజ్ పాలకవర్గాన్ని శాలువాతో ఘనంగా సన్మానించారు. గురుస్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఇరుముడి మహా పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవుల, ప్రశాంత్, నవీన్, ముద్విన్, వార్డు మెంబర్లు మహేష్, కంబాలపల్లి బ్రహ్మం, కంబాలపల్లి భాస్కర్, కంబాలపల్లి జగన్, మాజీ ఎంపీపీ వీరయ్య, పట్నం వెంకటేష్ యాదవ్, పట్నం వంశీ, పట్నం మధు అయ్యప్ప గురు స్వాములు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిక



**కడ్తాల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బిజెపి పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు అండే కార్ రామచందర్ జీకి కండువా కప్పి స్వాగతం పలికారు.ఆదివారం కడ్తాల్ మండలంలోని రావిచెడ్ గ్రామంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పిటిసి, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ సమక్షంలో రామచందర్ జీ బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ రాబోయే జెడ్పిటిసి, ఎంపీటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్, ప్రియా, రమేష్, శీను నాయక్, మాజీ ఎంపీపీ సువాలి పంతు, మాజీ ఎంపీటిసి యాదయ్య, నాయకులు బాలకృష్ణ, లింగం, పవన్, కృష్ణయ్య, కుమార్, లక్ష్మణ్, చందర్, ప్రేమ్ బాబా, కిషన్, సక్రు, రాజు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రసాగర్ వద్ద సాగునీరు విడుదల చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**అమ్రాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట మండల కేంద్రంలోని చంద్రసాగర్ జలాశయం నుండి 1250 ఎకరాలకు సాగునీరు విడుదల చేశారు. 1943లో ప్రారంభమై 1946లో పూర్తయిన ఈ జలాశయాన్ని అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించింది. 0.26 టీఎంసీ సామర్థ్యం కలిగిన ఈ



రిజర్వాయర్ 22 పిట్ల నీటిని నిల్వ చేసుకోగలదు.ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ "ఇది రైతు ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం. చంద్రసాగర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాము" అని తెలిపారు.ఇటీవల కురిసిన వర్షాల వలన జలాశయం నిండడంతో రైతుల పంట పొలాలకు నీటిని విడుదల చేయగలిగామని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎకరానికి పన్నెండు వేల పెట్టుబడి సాయం, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులను ఆదుకున్నామని వివరించారు. ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాబోయే రోజుల్లో పూర్తి చేసి అమ్రాబాద్ వరకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మాజీ ఎంపీపీ రామనాథం కాశన్న యాదవ్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ లో ధ్యాన సంబురాలు ప్రారంభం





భారీగా తరలి వచ్చిన తెలుగు రాష్ట్రాల ధ్యానులు












**కడ్తాల్, డిసెంబర్ 21 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి శివారులో గల కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహాయాగం- 4 అంగరంగ వైభావంగా ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ సీబీఐ డైరెక్టర్ కార్తికేయన్, ఫౌండర్ బుద్ధ సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ పి.చంద్రశేఖర్, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం తమ సందేశాలను విన్పించారు. ఈ సందర్భంగా ధ్యానం,శాకాహారం,పిరమిడ్ జగత్ కోసం బ్రహ్మర్షి పత్రీజీ చేసిన సేవలను కొనియాడారు. అలాగే పత్రీజీ ధ్యాన మహాయాగం- 4 కార్యక్రమం అద్భుతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహాయాగం- 4 లో మొదటి రోజు సంగీత నాధ ధ్యానం ధ్యానులకు చక్కటి అనుభూతిని కల్గిగించింది. ఉదయం జరిగిన సంగీత నాధ ధ్యానంలో పెద్ద సంఖ్యలో పిరమిడ్ మాస్టర్లు,ధ్యానులు పాల్గొని ఎంతో శ్రద్ధగా మూడు గుంటల పాటు ధ్యానం చేసారు. ఈ సందర్భంగా ఎంతో ఆనందానుభూతులకు లోనయ్యారు. పత్రీజీ శక్తి స్థల్ శ్రీ సరస్వతి సభా ప్రాంగణంలో ప్రతీజీ ధ్యాన మహాయాగం విజయవంతంగా జరుగుతోంది. కార్యక్రమంలో మొదటి రోజు నిర్వహించిన ప్యానల్ డిస్కషన్ ప్రొగ్రామ్ ధ్యానులకు మంచి జ్ఞానాన్ని పంచింది. ప్యానల్ డిస్కషన్ లో జర్మన్ మాస్టర్ రమేశ్, ఫ్రాన్స్ మాస్టర్ సుధాకర్ ,మాస్టర్ ఇవాన్, కెనాడ మాస్టర్ సుమన్, యూఎస్ఏ మాస్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ధ్యానం గొప్పతనం, ధ్యానం విశిష్టత, ధ్యానంతో మనిషిలో ఎలాంటి సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి అనే విషయాల గురించి, అలాగే ధ్యాన ద్వారా తాము పొందిన ప్రయోజనాల గురించి చక్కగా వివరించారు.ఈ కార్యక్రమానికి మెంటారుగా ఫౌండర్ బుద్ధ సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ పి.చంద్రశేఖర్ వ్యవహరించారు. సరస్వతి సభా ప్రాంగణంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగంలో ఆధ్యాత్మిక వేత్తల సందేశాలు ధ్యానులకు అద్భుతమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. థైయిలాండ్ కు చెందిన రాజయోగి ప్రొఫెసర్ డాక్టర్ ఇటికాన్ వాటాన పాల్గొని అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా గౌతమి బుద్ధుడి బోధనల గురించి క్వాంటమ్ ఫిజిక్స్ గురించి అందరికీ అర్థమయ్యే విధంగా చక్కగా వివరించారు. అలాగే తాను ధ్యానం మొదలుపెట్టిన తర్వాత తన శరీరంలో తనలో చోటుచేసుకున్న మార్పుల గురించి వివరించి ధ్యానులకు విశేషమైన జ్ఞానాన్ని అందించారు. అనంతరం పీస్ ట్రీ ఇన్నోవేషన్స్ సొసైటీ సహ-వ్యవస్థాపకులు డాక్టర్ సుమన్ కొల్లిపొర, ధ్యానం, అలాగే ధ్యానం ద్వారా పొందే ప్రయోజనాల గురించి అద్భుతంగా వివరించారు అలాగే సూక్ష్మధ్యానం, మందస్మితం,చైతన్యం, ఆరోగ్యం అనే అంశాల గురించి చక్కగా తెలియజేసి ధ్యానులకు మంచి జ్ఞానాన్నిపంచారు.

# సర్పంచ్ లేని రెండేళ్లు గ్రామాలకు అభివృద్ధి నష్టం గంగవరం రామకృష్ణారెడ్డి

**వనపర్తి,డిసెంబర్ 21 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
గ్రామ పంచాయతీ ఎన్నికలు లేక దాదాపు రెండు సంవత్సరాలు గడిచిపోవడంతో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీ



సర్పంచులు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆయన కొత్తగా ఎన్నికైన సర్పంచులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు అంశాలను గుర్తు చేశారు.సర్పంచ్‌లు లేకపోవడం వల్ల గ్రామసభలు జరగకపోవడం, అభివృద్ధి ప్రణాళికలు రూపొందకపోవడంతో గ్రామాలకు రావాల్సిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదన్నారు. అధికారుల పాలన రొటీన్ పరిపాలనకే పరిమితమవుతుందని, ప్రజల తరఫున నిధులు తెచ్చే బాధ్యత ఎన్నికైన సర్పంచులదేనని పేర్కొన్నారు. కొత్త సర్పంచులు గ్రామసభలు నిర్వహించి, 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల నూతన భవనానికి భూమి పూజ చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**అమ్రాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 2 కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నూతన భవనానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్



వంశీకృష్ణని ఘనంగా సన్మానం చేశారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రజా పాలనలో భాగమని, తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా ప్రత్యేక శిక్షణతో పాటు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, విద్యార్థుల భవిష్యత్తు కోసం సమగ్ర చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, మాజీ వైస్ ఎంపీపీ శంభు శోభ, మాజీ కాప్షన్ నెంబర్ అబ్దుల్ రహీం, దాసరి శ్రీనివాసులు, జూలూరు సత్యనారాయణ, వెంకట్ రమణ, అధికారులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూరియా..పొందడం కష్టమే!






### యాప్‌లోనే బుకింగ్ అవకాశం
### అవగాహన లోపంతో రైతులకు ఇబ్బందులు

**ఆమనగల్లు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాసంగి సీజన్‌లో యూరియా కొరత తలెత్తకుండా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. రైతులు స్వయంగా తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా యూరియా బుకింగ్ చేసుకునేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులు డీలర్లు, రైతులకు యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త విధానంపై తలెత్తిన పలు సందేహాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రాల్లోని సహకార సంఘాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను యాప్‌లో పరిశీలించి, రైతులు ముందుగానే బుకింగ్ చేసుకునే అవకాశం ఈ విధానంలో ఉంది. యూరియా పంపిణీలో పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించినప్పటికీ, మెజార్టీ రైతులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఇది సవాలుగా మారుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త విధానంపై డీలర్లు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. యూరియా ఎక్కడికి వస్తోంది, ఎవరి వద్ద ఎంత నిల్వ ఉంది, ఏ రైతు ఎంత తీసుకెళ్లాడు వంటి వివరాలన్నీ యాప్‌లో నమోదు కావడం వల్ల వ్యాపారపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధర చెల్లించి కంపెనీల నుంచి యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని, అయితే రైతులకు మాత్రం అదే ధరకు ఇవ్వాలని నిబంధనలు ఉండటం వల్ల నష్టపోతున్నామని హోల్‌సేల్, రిటైల్ డీలర్లు వాపోతున్నారు. ఈ అంశాలపై పూర్తిస్థాయి అధ్యయనం జరిపి అవసరమైన మార్పులు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ అధికారులు హామీ ఇచ్చారు. యాప్‌లో పంటల వారీగా యూరియా పరిమితిని కూడా ఖరారు చేశారు. ఎకరా వరి సాగు చేసే రైతుకు మూడు బస్తాలు, మొక్కజొన్నకు నాలుగు బస్తాలు, పత్తికి మూడు బస్తాలు, కూరగాయల సాగుకు ఒకటి లేదా రెండు బస్తాలకే అనుమతి ఉంటుంది. ఒకసారి యూరియా పొందిన రైతు మరో 15 రోజుల వరకు తిరిగి తీసుకునే వీలు ఉండదు. బుకింగ్ సమయంలో రైతు పేరు, భూమి వివరాలను నమోదు చేయాల్సి ఉండగా, వ్యవసాయ శాఖ 2018లో నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు మాత్రమే ఓటీపీ వస్తోంది. దీంతో ఫోన్ నంబర్ మారిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి వ్యవసాయ విస్తరణ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. యాప్‌లో ఎంపిక చేసుకున్న కేంద్రానికి వెళ్లి నగదు చెల్లించి, 24 గంటల్లోపే యూరియా తీసుకెళ్లాల్సి ఉంటుంది. సరైన అవగాహన కల్పిస్తేనే ఈ కొత్త విధానం రైతులకు ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యవసాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ, ఇరుముడి కార్యక్రమం



**కడ్తాల్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్ మండలం కర్కల్ పహాడ్ గ్రామంలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి మహాపడి పూజ, ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం గురుస్వాములు రవీందర్ రెడ్డి, నర్సింగ్, నల్లవోతుల జయరాములు, హరి, నాగరాజు, పట్నం శివరాజు సమక్షంలో మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాలదారులు ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ "భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుంది" అని పేర్కొన్నారు.

## వనపర్తిలో 26న అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం




**వనపర్తి డిసెంబర్ 21( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శబరిమల అయ్యప్ప స్వామి మండల పూజకు అనుసంధానంగా వనపర్తి రాజానగరం అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 26న ఘనంగా మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు ముత్తు కృష్ణ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి చీర్ల కృష్ణ గురుస్వామి తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ రావుల చంద్రశేఖరరెడ్డి సహకారం అందిస్తున్నారన్నారు. ఉదయం అభిషేకాలు, పల్లకిసేవ, సహస్రనామార్చన, అన్నప్రసాద వితరణ, సాయంత్రం పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

## రేణుక ఎల్లమ్మ గుడికి మాజీ సర్పంచ్ విరాళం




**ఎలిగేడు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని నర్సాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ గుడి ఆవరణలో ఆదివారం భక్తి భావనలతో కూడిన విశేష ఘట్టం చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్ తంగెళ్ల స్వప్న కుమారి యాదవ్ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ గౌడ సంఘ నాయకులకు ఇరవై వేల నూట ఇరవై ఒక రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు రేణుక ఎల్లమ్మ తల్లి కరుణ కటాక్షాలు సమాజంపై ఎల్లప్పుడూ నిలవాలని ప్రార్థించారు. విరాళం అందజేసిన స్వప్న కుమారి యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి, సమాజ ఐక్యతకు ఈ విరాళం ప్రతీకాత్మకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కబడ్డీ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్ రావు



**ఎలిగేడు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్ రావు ను కబడ్డీ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి పెడుతుందని అందుకు గ్రామాల్లోని యువకులను కబడ్డీ ఆటపై దృష్టి సారించేలా తల వంతు కృషి చేస్తానని అన్నారు. అందుకు సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు కు కృతజ్ఞతలు తెలిపారు.

## సేవా మార్గమే ప్రజల్లో సుస్థిర స్థానం



**ఎలిగేడు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసేవారే ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటారని నా నేస్తం ట్రస్ట్ అధ్యక్షులు కట్ల సత్యనారాయణ ఆదివారం పేర్కొన్నారు. నా నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో నా నేస్తం కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఎలిగేడు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలిగేడు గ్రామపంచాయతీ పాలకవర్గం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్ కుమార్ మాట్లాడుతూ తమకు సేవ చేయడానికి అవకాశం ఇచ్చిన ఎలిగేడు ప్రజలందరికీ రుణపడి ఉంటామని, అందరినీ తమతో కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు ట్రస్ట్ గౌరవాధ్యక్షులు పెంట శ్రీనివాస్, బూర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వీరగోని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు తానిపర్తి సుధాకర్ రావు, అలాగే ట్రస్ట్ బాధ్యులు మామిడి డిల్లేశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి, సత్యనారాయణ, రంగు రాములు, గంప రాజశేఖర్, వీరన్న, రమేష్, శ్రీనివాస్, సరిత రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దుర్షేడ్ గ్రామం గోపాల్‌పూర్ క్రాస్ రోడ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మిట్టపల్లి రత్నా (59) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ చల్మెడ హాస్పిటల్‌లో మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

## నేడు నూతన సర్పంచ్ ప్రమాణ స్వీకారం



**వెల్దండ, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో సోమవారం నూతన సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దండ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో నిమగ్నమై, ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్దండ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రజలు తమను అత్యధిక మెజార్టీతో సర్పంచ్‌గా గెలిపించడం ద్వారా చూపిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరించి వెల్దండను అభివృద్ధి పథంలో నడిపిస్తానని మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ స్పష్టం చేశారు.

## క్రీస్తు బోధనలు మానవాళి కి ఆదర్శనీయం.




**కూకట్పల్లి డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోన ఆదర్శ నగర్ లోని గ్లోరీ అఫ్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పాస్టర్లు మరియు స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లోక రక్షకుడు.. కరుణామయుడు.. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున జరుపుకునే క్రిస్మస్ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయం అని అన్నారు. డివిజన్ ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయుకులు, చర్చ్ పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీ ధర్నా



**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఏఐసీసీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన ఈ ధర్నాలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నియంతృత్వ పాలనను కొనసాగిస్తున్నారని, కాంగ్రెస్ అగ్రనేతలపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పోరాడుతూ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ధర్నాకు కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయకుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి పూర్వం ప్రజలను చైతన్యం చేసేందుకు స్థాపించబడిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అడ్డం పెట్టుకొని సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమంగా కేసులు నమోదు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకార పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ త్యాగాలను గుర్తుచేసిన ఆయన, రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. తప్పుడు కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్‌తో పాటు వివిధ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు మండలంలో కొత్త సర్పంచుల ప్రమాణ స్వీకారం




**ఎలిగేడు, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం అధికారికంగా కొలువుదీరనున్నారు. 2024 ఫిబ్రవరి వరకు పదవీకాలం ముగిసిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించక, పరిపాలన బాధ్యతలను ప్రత్యేక అధికారుల చేతుల్లో ఉంచింది. ఆ తరువాత 22 నెలలపాటు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అరకొర నిధులతో గ్రామాల పనులను కొనసాగించారు. ఎట్టకేలకు ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంతో, పంచాయతీ కార్యాలయాలు పాలకవర్గాల సందడితో కళకళలాడుతున్నాయి. ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల సర్పంచులు, 114 వార్డు సభ్యులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారుల నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం జరగడంతో గ్రామాల్లో అభివృద్ధి పథకాలు వేగవంతం అవుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామాలు మరింత అభివృద్ధి దిశగా పయనిస్తాయని ఆశాభావం వ్యక్తమవుతోంది

# నూతన గ్రామ పంచాయతీ భవనానికి ప్రత్యేక పూజలు





**పాలకుర్తి, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామ పంచాయతీ భవనంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ తన పాలకవర్గంతో కలిసి వేదపండితులచే సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. గత సర్పంచ్ ముక్కెర రాజకుమారి శ్రీనివాస్ పదవీకాలం ముగిసే సమయానికి 20 లక్షల ఈజీఎస్ నిధులతో పంచాయతీ భవనం నిర్మాణం పూర్తి కాగా, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ 2024 జనవరి 28న ఈ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుండి ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో పరిపాలన కొనసాగింది. ఇక కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం సోమవారం జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోడిజుట్టు సుభాష్, ఉప సర్పంచ్ ఒడ్నాల జ్యోతి రాజు, వార్డు సభ్యులు సంతపూరి కుమార్, జూపాక వెంకటేష్, నెరువట్ల అశోక్, తిప్పని సరస్వతి నరేందర్, సాదుల వెంకటేష్, పన్నాల రాజేశ్వరి, పొన్నం సత్తయ్య, సంతపూరి లింగమూర్తి, సంకరి కుమార్, సంతపూరి సంధ్య సతీష్, గన్నేవరపు పద్మ శంకర్, కారోబార్ కేశ శ్రీనివాస్ తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# శాతవాహన వృక్షశాస్త్ర విద్యార్థుల క్షేత్ర పర్యటన



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగ విద్యార్థులు శైవలాల సేకరణలో భాగంగా దిగువ మానేరు డ్యామ్‌ను సందర్శించారు. విభాగాధిపతి డా. సాయిని కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో శైవలాల సేకరణ విధానం, భద్రపరిచే పద్ధతులు, వాటి ఆర్థిక ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా. అభినేష్, డా. శివకుమార్ శైవలాల అవసరాన్ని వివరించి, వాటి శాస్త్రీయ ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రమాకాంత్ మాట్లాడుతూ “తరగతి గదిలోని పాఠ్యాంశాలతో పాటు క్షేత్ర పర్యటనల ద్వారా మాత్రమే ఆచరణాత్మక జ్ఞానం, వాస్తవ అనుభవాలు పొందగలరు” అని విద్యార్థులను ప్రోత్సహించారు. వృక్షశాస్త్ర విద్యార్థులు ఉత్సాహభరితంగా పాల్గొని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ శైవలాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని మాత్రమే కాకుండా, ప్రకృతి వైభవాన్ని కూడా సన్నిహితంగా అనుభవించారు.

# తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్ నిర్వహణ






**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కోత్తపల్లి మండలంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. తైక్వాండో మాస్టర్ బుర్ర ప్రవీణ్ కుమార్ మానస ఆధ్వర్యంలో, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి పలు రకాల బెల్ట్స్ సాధించారు. ముఖ్య అతిథులుగా డివైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ వెణుగోపాల్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పొలసాని శిరీష పాల్గొన్నారు. తల్లిదండ్రులు కూడా హాజరై పిల్లలకు ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా డివైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తైక్వాండో శిక్షణ వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని, ముఖ్యంగా అమ్మాయిలకు ఇది రక్షణ సాధనమని పేర్కొన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తైక్వాండో సర్టిఫికేట్లు ఉన్నత చదువులకు ఉపయోగపడతాయని, ఉద్యోగాల్లో క్రీడాకోటా ద్వారా రెండు శాతం రిజర్వేషన్ లభిస్తుందని వివరించారు. తైక్వాండోను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఎస్‌జిఎఫ్ సెక్రటరీ వెణుగోపాల్ అభినందించగా, పిల్లలకు శిక్షణ అందిస్తున్న అకాడమిక్ హైట్స్ స్కూల్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో బ్లాక్ బెల్ట్స్ సి. హెచ్. శరత్, మేడి వంశీ, బి. అరుణ, గుర్రం నికిల్, అన్నాజి విష్ణువర్ధన్, ఇ. శ్రీనిది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ముందుండి తీర్చుతున్న మాజీ కార్పొరేటర్ రవీందర్ గౌడ్



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్త 10వ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ రోడ్ నెంబర్ 4 ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు అల్కాపురి, కోతి రాంపూర్ ప్రాంతాలకు త్వరగా చేరుకోవడానికి రోడ్ నెంబర్ 10కి కలిపే లింకు రోడ్డు లేకపోవడంతో ఎన్నో రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు మాజీ కార్పొరేటర్ రవీందర్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరాన్ని గుర్తించిన ఆయన, తన సొంత ఖర్చుతో అక్కడ పేరుకుపోయిన మట్టి గుట్టలను జేసీబీ సహాయంతో తొలగించి, గ్రేవెల్ మెటీరియల్ పోయించి కొత్త లింకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్ నెంబర్ 10కి కలిపే మార్గం సిద్ధమవడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ముందుండి పరిష్కరించడంలో రవీందర్ గౌడ్ చూపిన చొరవకు నివాసులు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు.

# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత




**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామాల్లో పోలీసులు ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమ ఇసుక రవాణా బయటపడింది. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎల్లవేణి సంతోష్ (తండ్రి రాజయ్య), ఎలుకపెల్లి ప్రశాంత్ (తండ్రి చంద్రయ్య) అనువారు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా, గోపాల్‌పూర్ గ్రామ శివారులో కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, టీఎస్ 02యూసీ7457, టీఎస్27టీ7077 నంబర్లతో ఉన్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం కోర్టుకు పంపనున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# మట్ట పార్వతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన వెల్దండ సర్పంచ్






**వెల్దండ, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్**
:వెల్దండ మండల కేంద్రంలో విషాదం నెలకొంది. మట్ట లక్ష్మయ్య, భార్య మట్ట సావిత్రమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. ఈ సందర్భంగా వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ పార్వతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత మట్ట పార్వతమ్మ కుటుంబాన్ని పరామర్శించి, అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దండ ఉప సర్పంచ్ ఎర్ర శీను, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు, సేవాదళ్ అధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, పురుషోత్తం, ఎండి రషీద్, వెల్దండ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, నాల్గవ వార్డ్ మెంబర్ కిష్టాలు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు తరాల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కీర్తిశేషులు పబ్బ రాజేశ్వరమ్మ -నారాయణ దంపతుల బంధువుల ఐదు తరాల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కరీంనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఏసీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఒకరినొకరు కలుసుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కొల్లూరి ఆనందం, వెంకటేశ్వర్లు, ఎలుగూరి మారుతి, పైడా శ్రీనివాస్, పల్ల మురళీధర్, పల్ల కిషన్, పబ్బ సంతోష్, గుడాల లక్ష్మణ్, అనంతుల రాజబాబు, తోడుపునూరి శ్యాంసుందర్, పైడా రజిత, పెద్ది అంజక్కతో పాటు మరో 150 మంది బంధువులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం




**సిద్దిపేట, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిద్దిపేట జిల్లా కోర్టులో ఆదివారం లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. కుటుంబ గొడవలు, చెక్ బౌన్స్, ప్రమాద బీమా, బ్యాంకు రుణాలు వంటి కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. జిల్లా జడ్జి సాయి రమాదేవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 14,583 కేసులు పెండింగ్‌లో ఉండగా, 1,557 కేసులను గుర్తించి 828 కేసులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అంతకుముందు పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా జడ్జి ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

# కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

*- జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప*



**ఆమనగల్లు, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కేసుల సత్వారం పరిష్కారం కోసం లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆదివారం లోక్ అదాలత్ లో 136 కేసులను పరిష్కారం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప సూచించారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ సర్పంచ్ మండల ఫోరం అధ్యక్షుడిగా బాసెట్టి నాగరాజ్....



**పాల్వంచ- డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కామారెడ్డి పాల్వంచ నూతన మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షునిగా నాకు అవకాశం ఇచ్చిన పాల్వంచ మండల ప్రతి గ్రామ సర్పంచ్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ ఒక బిసి బహుజన బిడ్డకు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుల పదవి ఆదక్కడం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కు సాధ్యం ఈ అవకాశాన్నీ ప్రజల అవసరాలకు అనుకూలంగా పని చేసి గౌరవ షబ్బీర్ అలీ మరియు పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ గౌడ్ కు పేరు ప్రఖ్యాతలకు కృషీ చేస్తానని తెలియజేస్తున్నాను.

# ఉపాధి హామీ పథకం రక్షణకై కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**వరంగల్-హనుమకొండ, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పబ్లిక్ గార్డెన్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సంక్షేమ పథకం కాదు, ఇది ప్రజల హక్కు అని అన్నారు. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గించిందని, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని, బడ్జెట్ కేటాయింపులు తగ్గించి, పనిదినాలు తగ్గించడం ద్వారా పేదల జీవనాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. గాంధీ గారి పేరును తొలగించడం ప్రజలకు మోసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఎమ్మెల్యే నాయిని సన్మానం**
హనుమకొండలో జరిగిన 4వ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సన్మానించారు. విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని, మార్షల్ ఆర్ట్స్ యువతకు ఆత్మరక్షణతో పాటు మానసిక బలం ఇస్తాయని అన్నారు.

# గిరిజన తండాల్లో సర్పంచ్, సభ్యుల సన్మానం




**హుస్నాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజ్ నాయక్ ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలంలోని గిరిజన తండాల్లో ఇటీవల ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను సన్మానించారు. అదేవిధంగా పోటీలో ఓడిన అభ్యర్థులను కూడా అభినందించి సన్మానం చేశారు. గెలిచిన వారు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఓడిన వారు కూడా ప్రజల పక్షాన నిలవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్య కృష్ణా నాయక్, ఉప సర్పంచ్ భూక్య తిరుపతి నాయక్, వార్డ్ సభ్యులు మాలోతు సత్యం నాయక్, సర్పంచ్ పోటీదారుడు భూక్య వీరన్న నాయక్, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాలోత్ రాంచందర్ నాయక్, భూక్య మోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలకవర్గానికి ఘన సన్మానం





**పాలకుర్తి, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కన్నాల గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన పాలకవర్గాన్ని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పద్మశాలి కమ్యూనిటీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్క రామస్వామి, ఉపసర్పంచ్ చాంద్ పాషా, వార్డు సభ్యులు సిరిపురం తులసమ్మ, కూడికల సురేష్, భీమనపల్లి మహేశ్వరి లను ప్రత్యేకంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు అరుకాల సతీష్, జనరల్ సెక్రటరీ భీమనపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశాలీల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం సంతోషకరమని, ఇకనుండి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. తాటిపాముల రమేష్, చింతకింది భాస్కర్, బూర్ల శంకర్, సిరిపురం చంద్రయ్య, భీమనపల్లి భూమేష్, దాసరి రాయమల్లు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 111 ఏళ్ల వృద్ధురాలు జాడి చంద్రమ్మ మృతి



**పాలకుర్తి, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పాలకుర్తి మండలం బక్కరాజంపల్లి గ్రామానికి చెందిన జాడి చంద్రమ్మ (111) ఆదివారం వయోభారంతో కన్నుమూశారు. ఆమె భర్త భీమయ్య 25 ఏళ్ల క్రితమే మృతి చెందగా, ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుళ్లతో కుటుంబాన్ని కొనసాగించారు. అయితే కుమారులు ముగ్గురూ ఆమె కళ్లముందే పలు కారణాలతో మరణించారు. చంద్రమ్మకు మొత్తం 16 మంది మనవలు, మనవరాళ్లు ఉన్నారు. గ్రామంలో ఇన్ని ఏళ్ల పాటు జీవించిన ఏకైక మహిళగా ఆమెను గ్రామస్థులు గుర్తించారు. వృద్ధురాలి మరణం పట్ల గ్రామస్థులు శ్రద్ధాంజలి ఘటించి, ఆమె దీర్ఘాయుష్కు గౌరవం తెలిపారు.

# జాగృతిలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ జాగృతి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కరీంనగర్ మండల సీనియర్ నాయకులు జాగృతిలో చేరారు. మండల ఇంచార్జ్ జంగ అపర్ణ సాగర్ ఆధ్వర్యంలో కమాగ్రి అంజనేయులు, దాసరి అంజలి, పుల్లూరి శ్యామల, కారుపాకల శ్రీలత, బీస లక్ష్మీ లకు జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ జాగృతి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ జాగృతి అధినేత్రి కవిత నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యలపై పోరాటం కొనసాగుతోందని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ధ్యేయంగా జాగృతి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని, అందువల్ల ప్రజల విశ్వాసం కోల్పోయిందని, నాయకులు జాగృతిలో చేరుతున్నారని తెలిపారు. 2029లో తెలంగాణ రాష్ట్రానికి కవితక్క నాయకత్వం వహించడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, చంటి శ్రీనివాస్, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, యువజన నాయకులు హుస్నాబాద్ రాజ్‌కుమార్, జిల్లా నాయకులు బసవేణి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక నిర్మూలనకు పిలుపు



**హుస్నాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ సిద్దిపేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు చలి తీవ్రంగా ఉందని, వారికి దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేయాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, పిల్లలను బడిలో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటుకబట్టిలు, హోటళ్లలో బాల కార్మికులను ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009ను పకడ్బందీగా అమలు చేసి, తెలంగాణను బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు మంచి లక్ష్యాలు పెట్టుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన మంగపేట సర్పంచ్



**పెద్దపల్లి, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన నూతన సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఉపసర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు శ్రీనివాస్, రాజు గార్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు శివపల్లి నివాసంలో వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామడుగులో హత్య కేసు ఛేదన

- ఐదుగురు అరెస్ట్



**రామడుగు, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్య (36) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో తండ్రి, భార్య సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు విచారణలో తేలింది. ఈ దారుణానికి పాల్పడిన గాదె లచ్చయ్య (63), శిరీష (32), ఉప్పరపల్లి కోటేశ్వర్ (31), మహమ్మద్ అబ్రార్ (23), కొలిపాక రవి (55)లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరానికి ఉపయోగించిన ఫోన్లు, బైక్, రూ. 40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా రంగనాయక్ నాని భార్య సాత్విక



**నల్గొండ, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అడవిదేవులపల్లి మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు, ఇంటర్నేషనల్ న్యూ విజన్ ఫౌండేషన్ చైర్మన్, భారత్ సమాజ్ డెవలప్ పార్టీ ఫౌండర్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రంగనాయక్ నాని సేవా కార్యక్రమాలతో ప్రజలలో ఆదర్శంగా నిలుస్తున్నారు. రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న ఆయన, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య కుర్ర సాత్విక (అమ్ములు)ను ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రజలు మమ్మల్ని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు.

# పెట్రోల్ బంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సాయి ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ హిందుస్థాన్ పెట్రోలియం బంకును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు కు బంక్ యాజమాన్యం వారు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.
అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బంకు యాజమాన్యం సాయి స్వరూప్ – సాహితీలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంక్ యాజమాన్యం వారు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన వృక్షశాస్త్ర
# విద్యార్థుల క్షేత్ర పర్యటన

**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



శాతవాహన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగ విద్యార్థులు శైవలాల సేకరణలో భాగంగా దిగువ మానేరు డ్యామ్‌ను సందర్శించారు. విభాగాధిపతి డా. సాయిని కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో శైవలాల సేకరణ విధానం, భద్రపరిచే పద్ధతులు, వాటి ఆర్థిక ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా. అభినేష్, డా. శివకుమార్ శైవలాల అవసరాన్ని వివరించి, వాటి శాస్త్రీయ ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రమాకాంత్ మాట్లాడుతూ %– "తరగతి గదిలోని పాఠ్యాంశాలతో పాటు క్షేత్ర పర్యటనల ద్వారా మాత్రమే ఆచరణాత్మక జ్ఞానం, వాస్తవ అనుభవాలు పొందగలరు" అని విద్యార్థులను ప్రోత్సహించారు. వృక్షశాస్త్ర విద్యార్థులు ఉత్సాహభరితంగా పాల్గొని, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ శైవలాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని మాత్రమే కాకుండా, ప్రకృతి వైభవాన్ని కూడా సన్నిహితంగా అనుభవించారు.

# ప్రమాద బాధితుడికి బియ్యం అందజేత



**రామగుండం, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామగుండం కార్పొరేషన్ 1వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే బాణాల తిరుపతి ఇటీవల మోటార్‌సైకిల్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ ఆదివారం రోజున సభ్యుడు బొల్లంపల్లి ప్రభాకర్ గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి సహాయం అందించినందుకు బాధిత కుటుంబం ఫౌండేషన్ అధ్యక్షుడు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో డివిజన్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, సభ్యుడు గుడిమళ్ల కరుణాకర్ పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి



**సంగారెడ్డి, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పటాన్చెరు నియోజకవర్గం బీరంగూడలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాలలో 15వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గోపూజ, యాగం కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సి. అంజి రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణి రద్దు



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నేడు జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం 22వ తేదీన జరగనున్నందున అధికారులు ఆయా పనుల్లో నిమగ్నమై ఉంటారని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ నుండి ప్రజావాణి యథాతథంగా నిర్వహించబడుతుందని కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆమె కోరారు.

# కాంగ్రెస్ పార్టీలోకి ఎలిగేడు సర్పంచ్



**ఎలిగేడు , డిసెంబర్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నూతనంగా గెలుపొందిన ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో శివపల్లి లోని ఆయన గృహంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ద్వారానే జరుగుతుందని రాబోయే కాలంలో ఎమ్మెల్యే గారి సహకారంతో మరియు ప్రజల అండదండలతో అభివృద్ధి చేస్తానని అన్నారు.

## ఆర్ యెస్ పి హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన.

-ఎమ్మెల్యే గాంధీ.

**కూకట్పల్లి డిసెంబర్ 21( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీ లో ఆర్.ఎస్. సి హాస్పిటల్ వారి సౌజన్యం తో సీనియర్ నాయకులు తేళ్ల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు గారు .


# రాజమార్గంలో కేసుల సత్వర పరిష్కారం

**మంథని, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంథని కోర్టు ప్రాంగణంలో ఆదివారం జాతీయ లోక్ అధాలత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సీనియర్ సివిల్ జడ్జి వి. భవానీ మాట్లాడుతూ రాజమార్గంలో పలు కేసులు పరిష్కారం కావడం వల్ల కోర్టులపై భారం తగ్గి, తీవ్రమైన నేరాలు సత్వరమే పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. క్షణికావేశంలో జరిగే చిన్నచిన్న నేరాలకు జరిమానాలు విధించడం, రాజీ ద్వారానే పరిష్కారం లభించడం జరుగుతుందని వివరించారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకున్న



సందర్భంలో కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. సుదారాణి, ఏపిపి సందీప్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కే. రఘోతం రెడ్డి, లోక్ అధాలత్ సభ్యులు కటుకం శ్రీనివాస్, డి. విజయ్ కుమార్, కనుకుంట్ల స్వామి, న్యాయవాదులు శశిభూషణ్, వ్యాస్కుమార్, సిరివెన్నెల, గోదావరిఖని 2వ పట్టణ సీఐ ప్రసాద్ రావు, వివిధ బ్యాంకుల అధికారులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చింతకుంట ధర్మరాజు శతజయంతి వేడుకలు



**నిజామాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజామాబాద్ పట్టణంలో ప్రసిద్ధ గోల్ హనుమాన్ ఆలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడు చింతకుంట ధర్మరాజు శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ధర్మరాజు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ధర్మరాజు భక్తి, సేవ, సామాజిక బాధ్యత అనే విలువలను జీవితాంతం ఆచరించిన మహానుభావుడని కొనియాడారు. నిజామాబాద్ పట్టణానికి ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచిన గోల్ హనుమాన్ ఆలయాన్ని వలయాకారంలో నిర్మించడం రాష్ట్రంలోనే అరుదైన విషయం అని, ఇలాంటి ఆలయం తెలంగాణలో మరెక్కడా లేదని పేర్కొన్నారు. ధర్మరాజు సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో జీవించిన మేధావి అని, పట్టణంలో ఆర్యవైశ్య స్కూల్‌ను ప్రారంభించడం, అద్భుతమైన డిజైన్‌తో మాణిక్ భవన్ నిర్మించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని గుర్తు చేశారు. మాణిక్ భవన్ ప్రారంభోత్సవానికి అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, అనంతరం భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ హాజరుకావడం ధర్మరాజు వ్యక్తిత్వానికి ప్రతీక అని అన్నారు.
గోల్ హనుమాన్ ఆలయ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు సనాతన ధర్మ వ్యాప్తికి అనిర్వచనీయమని, ధర్మం నిలబడితేనే సమాజం సురక్షితంగా ఉంటుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. తాను ఎమ్మెల్యే స్థాయికి చేరుకోవడంలో ధర్మరాజు ఆశీర్వాదం, చింతకుంట కుటుంబ ఆశీస్సులు ఉన్నాయని నమ్మకం వ్యక్తం చేశారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి విద్య, సేవ, సమాజహితాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో చింతకుంట ధర్మరాజు కుమారులు చింతకుంట రాజేందర్, చింతకుంట రవీందర్, గోల్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ బండారి నరేష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, ఉదయ్ మహారాజ్, మాణిక్ భవన్ అధ్యక్షులు పెద్ది సంగమేశ్వర్ గుప్తా, న్యాలం మోహన్ రావు, మాధవరావు తదితర ప్రముఖులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ నాయకుడు ఆనంద్ అకాల మృతి

### - పార్టీకి తీరని లోటు



**నిజామాబాద్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అర్బన్ నియోజకవర్గంలోని ఏడవ డివిజన్ శక్తి కేంద్ర ఇన్‌ఛార్జ్, బీజేపీ సీనియర్ నాయకుడు బట్టిగిరి ఆనంద్ (45) గుండెపోటుతో తెల్లవారుజామున అకస్మాత్తుగా కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హుటాహుటిన ఆయన ఇంటికి చేరుకుని మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "బట్టిగిరి ఆనంద్ నా అత్యంత సన్నిహితుల్లో ఒకరు. హిందూ ధర్మం కోసం, పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తూ బీజేపీకి ఒక సైనికుడిలా పనిచేశారు. ఆయన మరణవార్త నమ్మలేకపోతున్నాను. పార్టీ కోసం చేసిన ఆయన కృషి ఎప్పటికీ మరువలేనిది" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆనంద్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ చిన్న కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఆయన పవిత్ర ఆత్మ శాంతించాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. సీనియర్ నేత ఆకస్మిక మృతితో బీజేపీ శ్రేణుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పట్టణంలోని ఏడవ డివిజన్ శక్తి కేంద్ర ఇన్‌ఛార్జ్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ఆనంద్ పార్థివ దేహానికి బీజేపీ సీనియర్ నేతలు పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని, తన అనుచరుడైన ఆనంద్ పాడె మోసి అభిమానాన్ని చాటుకున్నారు.

# కరీంనగర్ టౌన్ పోలీసుల ఘనత

### సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా 60 మొబైల్ ఫోన్ల రికవరీ



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ గల్లంతైన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో కరీంనగర్ టౌన్ డివిజన్ పోలీసులు విశేష విజయాన్ని సాధించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, టౌన్ ఏసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు సెంట్రల్ ఈక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (CEIR) పోర్టల్ ద్వారా 60 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నాయి. వీటి అంచనా విలువ సుమారు రూ. 10 లక్షలు. కరీంనగర్-I, II, III టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఫిర్యాదులపై నిరంతర నిఘా ఉంచి, టెక్నికల్ విశ్లేషణ ద్వారా ఫోన్లను గుర్తించారు. అనంతరం యజమానులను పిలిపించి, తగిన ఆధారాలను పరిశీలించి, మొబైల్ ఫోన్లను అందజేశారు. పోగొట్టుకున్న ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఏసీపీ ప్రజలకు కీలక సూచనలు చేస్తూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీనివల్ల ఫోన్ దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయడంతో పాటు తిరిగి రికవరీ చేసే అవకాశం పెరుగుతుందని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ఆస్తులను కాపాడటంలో కరీంనగర్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా కరీంనగర్ "కిసాన్ గ్రామీణ మేళా"



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు, మహిళా సంఘాలు, గ్రామీణ ప్రజల ఆర్థిక ప్రగతిని కాంక్షిస్తూ 'కిసాన్ జాగరణ్' ఆధ్వర్యంలో కరీంనగర్ వేదికగా మరోసారి భారీ ఎత్తున "కిసాన్ గ్రామీణ మేళా" నిర్వహించబడుతోంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని హర్యానా మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించనున్నారు. కిసాన్ జాగరణ్ అధ్యక్షులు శ్రీ పి. సుగుణాకర్ రావు ఈ విషయాన్ని విలేకరులతో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ గత 2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన ప్రదర్శనలకు తెలంగాణలోనే అత్యధిక సంఖ్యలో రైతులు హాజరైన రికార్డు ఉందని, ఈసారి అంతకు మించి వినూత్న కార్యక్రమాలతో మేళాను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ లేదా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రదర్శనలకు దూరప్రాంత రైతులు వెళ్లలేకపోతున్నారని, అందుకే రైతు చెంతకే సాంకేతికతను తీసుకురావాలనే ఉద్దేశంతో కరీంనగర్‌ను వేదికగా ఎంచుకున్నామని వివరించారు. ఈ మేళా ద్వారా రైతులకు ఆధునిక సాంకేతికత, వ్యవసాయ పద్ధతులు, మార్కెట్ అవకాశాలు, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుదలపై ప్రత్యేక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# గంభీరావుపేట బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గెలిచిన అభ్యర్థులకు సన్మానం



**గంభీరావుపేట, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో పోటీ చేసి విజయం సాధించిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మరియు పోటీ చేసిన వారందరిని మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి మండల ఇన్‌ఛార్జ్ ఆడెపు రవీందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, భారతదేశ ఐక్యతను వివరించారు. పార్టీ లైన్లో కృషి చేసిన వారికి గుర్తింపు తప్పక లభిస్తుందని, నాయకులు ప్రజలతో మరింత అనుబంధం పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ "ఇదే స్ఫూర్తి, ఇదే ఐక్యతను కొనసాగిస్తూ రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కలిసికట్టుగా బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కంకణబద్ధులై కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్తఫా నగర్ గ్రామ సర్పంచ్ బండ సుకన్య దేవయ్య, నాగంపేట రాజిరెడ్డి, పొన్నాలపల్లి పొన్నాల మహేష్, కొత్తపల్లి ఉప సర్పంచ్ ప్రియాంక శ్రావణ్ యాదవ్, గంభీరావుపేట దేవసాని కృష్ణ, ముస్తఫా నగర్ కృష్ణకాంత్, గోరింటాల ప్రత్యూష మహేందర్, కొమ్మిరిశెట్టి రాజు, భాషవేణి ఉమా, సత్యనారాయణ, గజసింగవరం సంతోష్ చారి, మల్లుపల్లి రేవతి, సముద్రాలింగాపూర్ మహేష్ యాదవ్, నాగంపేట రంగు దేవరాజు, దండు పరశురాములు, కోల మల్లేశం, పొన్నలపల్లి భవిష్య నరేష్, ముచ్చర్ల రాకేష్, కొత్తపల్లి మధు, సంతోషి శ్రీనివాస్, బాలమణి గోపాల్, రాజుపేట ముడికే దేవవ్వ, నర్మల ఓరుగంటి నర్సింలు తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు వజిత్ హుస్సేన్, పత్తి స్వామి, రాజిరెడ్డి కిషన్ రావు, లక్ష్మణ్, ఎలేందర్ మోహన్, బిద్ది నర్సింలు, డాక్టర్ సత్యనారాయణ, రవీందర్ చంద్రం యాదవ్, పర్స తిరుపతి స్వామి, నర్సింలు భాస్కర్ నాయక్, అంజన్ రావు, రాజు నవీన్ తదితర ముఖ్య నాయకులు హాజరై సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన బెల్లంపల్లి ఎమ్మెల్యే



**మంచిర్యాల, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి నాయకత్వంలో సుమారు 85 శాతం సర్పంచ్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న ఎమ్మెల్యే కృషిని ప్రశంసిస్తూ, ఇది కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయాన్ని ఇలాగే కొనసాగించాలని, ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని సీఎం గారు ఎమ్మెల్యేను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులే ఈ విజయానికి ప్రధాన కారణం. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు. గెలిచిన సర్పంచులతో కలిసి గ్రామాల అభివృద్ధికి మరింత శ్రమిస్తాం" అని హామీ ఇచ్చారు.

# జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎంపిక



**కరీంనగర్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 22 నుండి 28 వరకు హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో జరగనున్న జాతీయ సమైక్యత శిబిరానికి స్థానిక వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్, ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి వి. అద్వైత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం మా కళాశాల నుండి ఒక ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎంపిక కావడం సర్వసాధారణం మాత్రమే కాదు, గర్వకారణం కూడా. ఇది మా వాలంటీర్స్ నియమ నిబద్ధత, అంకితభావానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అద్వైత్‌ను కళాశాల కరస్పాండెంట్ వి. ఆగం రావు, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, ఏసీఓబి సంపత్ కుమార్, ఏవోబి శ్రవణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బి. మహేష్, ఎన్. శ్రీనివాస్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

# ఆర్యవైశ్య సంఘం దాతల చేయూత


### పాఠశాలలకు భరోసా



**మొయినాబాద్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో విద్యారంగానికి మరో విలువైన తోడ్పాటు అందింది. జిల్లా అధ్యక్షులు గందే సురేష్ గుప్తా నాయకత్వంలో మొయినాబాద్, చిన్న మంగళారం ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల వినతికి స్పందించిన ఆర్యవైశ్య సంఘం దాతలు, విద్యార్థుల అవసరాల దృష్ట్యా స్కూల్ ఫర్నిచర్ కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ గజవాడ నరసింహులు గుప్తా రూ. 35 వేల రూపాయలు, ఫరూక్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీ ఎల్కుర్తి నారాయణ గుప్తా రూ. 10 వేల రూపాయల విరాళాన్ని ప్రకటించి పాఠశాలల అభివృద్ధికి తమ వంతు చేయూత అందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మేడం విశ్వనాథం గుప్తా, మాడిశెట్టి సత్యనారాయణ గుప్తా, గుండ్రవెల్లి సాంబశివ కుమార్ గుప్తా, నాచం శ్రీనివాస్ గుప్తా, మాజీ అధ్యక్షులు అనుమాని మురళీధర్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్ గుప్తా, యువజన సంఘం కోశాధికారి నీల రవీందర్ గుప్తా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## షాద్ నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### - ఒకరి మృతి



**షాద్ నగర్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్ నగర్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. షాద్ నగర్ చౌరస్తా నుండి మహబూబ్ నగర్ వైపు వెళ్లే రోడ్డులో పాత వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది.

## ధూళికట్ట గ్రామ పాలక వర్గానికి ఎమ్మెల్యే ఘన సన్మానం



**ఎలిగేడు, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల పరిధిలోని ధూళికట్ట గ్రామ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే విజయరమణా రావు ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే, గ్రామ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ మారం కొమురయ్య, ఉప సర్పంచ్ మేచినేని అండాలు సత్యనారాయణ రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల అభివృద్ధి దిశగా కొత్త పాలక వర్గం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కొర్ర రవి నాయక్



**మహేశ్వరం, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామం ఏనుగు చెరువు తండా 10వ వార్డు సభ్యుడు కొర్ర రవి నాయక్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ప్రమాణ స్వీకారం చేయకముందే తన సొంత ఖర్చుతో వార్డులో బోరు వేయించి నీటి సౌకర్యాన్ని కల్పించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని స్వతంత్ర అభ్యర్థి రాజు నాయక్ స్పష్టం చేశారు. 10వ వార్డులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తనకు తెలియజేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సిద్దిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ





**సిద్దిపేట, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సిద్దిపేట పట్టణంలోని కొండా మల్లయ్య గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన 43 మంది సర్పంచ్‌లు, 49 మంది ఉప సర్పంచ్‌లు, 330 మంది వార్డు సభ్యులకు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ బీజేపీ సాధించిన ఫలితాలు ఎవరు ఊహించని విజయమని, పార్టీ సిద్ధాంతాలను విశ్వసించి కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలను గ్రామ ప్రజలు గెలిపించారని పేర్కొన్నారు. దేశంలో మార్పు కోరేది బీజేపీ మాత్రమేనని, యువత వల్లే ఆ మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీనే దేశానికి దిక్సూచి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటమి అనేది గెలుపు మెట్లకు నాంది మాత్రమేనని, విశ్వసనీయతను నిరూపించుకుంటే విజయం తప్పకుండా సాధ్యమవుతుందని అన్నారు. ఎంఎల్ఏలకు రావాల్సిన ఐదు కోట్ల రూపాయల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని విమర్శించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్స్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. మహాత్మా గాంధీ ఆశయాలను కాంగ్రెస్ పట్టించుకోలేదని, గాంధీ కళలను బీజేపీ అమలు చేస్తోందని వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తోందని గుర్తుచేశారు. బీజేపీ పట్టణ పార్టీ మాత్రమే కాదని, గ్రామాల్లో కూడా గెలుస్తుందని నిరూపించిందని అన్నారు. రానున్న రోజుల్లో సిద్దిపేట జిల్లా పరిషత్, మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రతి వారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలని, అవినీతి లేకుండా పాలన సాగించాలని సూచించారు. నీతి, నిజాయితీతో పనిచేస్తే గౌరవం సహజంగానే వస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తుందని తెలిపారు. సిద్దిపేట ఎమ్మెల్యే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆ విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. చివరిగా "భవిష్యత్ మనదే అందరూ ధైర్యంగా ఉండాలి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


# ఉపాధి హామీ పథకం నుంచి మహాత్ముని పేరు తొలగించడం అవమానం: నర్సారెడ్డి భూపతి రెడ్డి

**మేడ్చల్, డిసెంబర్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మేడ్చల్ ఎంఆర్ఓ కార్యాలయం వద్ద టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశానుసారం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి భూపతి రెడ్డి మాట్లాడుతూ "ఉపాధి హామీ పథకం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం యావత్ భారతజాతినే అవమానపరచడం" అని ఉద్ఘాటించారు. 2006లో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో గ్రామీణ పేదలకు ఉపాధి హామీగా ప్రవేశపెట్టారని, సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించడం దీని ప్రధాన ఉద్దేశమని గుర్తుచేశారు. దీనికి మహాత్ముని పేరు పెట్టడం ద్వారా గ్రామీణ పేద కుటుంబాల జీవనోపాధి భద్రతను బలోపేతం చేశారని వివరించారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడం పేదల ఉపాధిని దెబ్బతీయాలనే కుటిల రాజకీయానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.




భారతదేశంలో మహాత్ముని పేరు, ఆశయాలు ఎప్పటికీ నిలిచిపోతాయని, కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల మనోభావాలను గౌరవించి ఉపాధి హామీ పథకంలో మహాత్ముని పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేష్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో సిపిఐఎం విజయోత్సవం



**అడవిదేవులపల్లి, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సిపిఐఎం గణనీయమైన విజయాన్ని సాధించింది. రాష్ట్రంలోని 19 జిల్లాలలో 91 సర్పంచ్‌లు, 124 ఉపసర్పంచ్‌లు, 1300 పైగా వార్డు సభ్యులు గెలుపొందారు. ఈ సందర్భంగా సిఐటియు కన్వీనర్ అడవిదేవులపల్లి చీనేను రాంబాబు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఈ విజయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తామని తెలిపారు. ఇదే ఉరవడి రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల వరకు కొనసాగిద్దామని స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ ఎన్నికల్లో గతం కన్నా మెరుగైన ఫలితాలు రావడానికి ప్రజల విశ్వాసమే తోడ్పడిందని పేర్కొన్నారు. ఈ కృషిలో భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

## సుందరయ్య పార్క్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



**మిర్యాలగూడ, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్క్‌ను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పార్కులోని సందర్శకులు, వాకర్స్‌తో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వాకింగ్ ట్రాక్, గార్డెన్, లైటింగ్ సమస్యలు ఉన్నాయని గుర్తించి, జనవరి 1వ తేదీ లోపు అన్ని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.